పుట్టింటికి ప్రయాణము

శ్రీమతి సుసర్ల లక్ష్మీనరసమాంబగారు

౧

గంటలు లెక్కించుకుంటూ కూర్చుంది గంగాభాయి పదకొండు కొట్టింది ఘడియారం గుమ్మంపద్ద గుఱ్ఱపుబండి ఆగింది బండిలోనుంచి దిగే భర్తకెదురుగా వెళ్ళింది గంగ సుబ్బారావు చెల్లెలుని అత్తవారింట దిగబెట్టివస్తున్నాడు. 'ఇంత ప్రొద్దెక్కిందే మీరైలు లేటైందా యేమిటి?' అన్నది గంగ-మరేనంటూ కూర్చున్నాడు 'లెండి స్నానం చెయ్యండి భోజనం చేదాము' అంది గంగ-ఇద్దరూ భోజనం చేశారు మంచం మీద పండుకుని గృహలక్ష్మి చూస్తున్నాడు గంగ తమలపాకులు చీల్చుతోంది "ఏమండీ! మిమ్మల్ని పక్కటి అడుగుతాను యేమీ అనరుగదా" అంది- "మంచిసంగతైతే యేమీ అనను అడుగు" అన్నాడు- "మంచిచెడ్డలకి మరేమీ లేదులెండి మా నాన్న యీ దసరా పండుక్కి మనల్నిద్దరినీ రమ్మని వుత్తరం వ్రాశాడు"

"ఓహో తెలిసింది ఎప్పుడూ ఆడవాళ్ళకి పుట్టింటి గోలే ఇపుడు వెడతానంటావేమిటి? ఏదీవుత్తరం?"

తీసియిచ్చి "మనం వస్తామంటే బయలుదేరి వస్తానని వ్రాశారు మీకు శలవలు యెన్నాళ్ళు?"

"అబ్బే అదెన్నాళ్ళు పదిహేను రోజులే కదూ గిఱ్ఱున తిరిగివస్తాయి శలవల్లో హాయిగా యింటిపట్టున వుండకుండా వూళ్ళమ్మట తిరగడం యేమిటీ?"

"అక్కడ మీరేమన్నా కష్టపడతారా యేమిటి? మీస్వంత యిల్లులాగే వుంటుంది శ్వశురగృహం పరమసుఖం అన్నారు మీకేంలోటూ?"

"మాటలు బాగా నేర్చావె నా స్వంతయిల్లులా యేలావుంటుంది? ఇంతకీ నీకు వెళ్ళాలనివుంది నీవు వెళ్ళుపోనీ"

"సరే నేనూ మీరూ వెడితే సర్దాగావుంటుంది నేను వెడితే మీకు భోజనం?"

"నా భోజనానికేమితే, నీవంత పట్టుదలగా వెళ్ళాలంటే వెళ్ళు మీ నాన్న వస్తే"

ఆ మాట అంటే గంగ చాలా సంతోషపడింది. నిజంగా వెళ్ళమన్నాడనుకుంది "చూశారూ మీకు కోపం వస్తుందని అడగలేదుగాని యెన్నాళ్ళనుంచో చూడాలని వుందండీ మావాళ్ళని, ఏడాదైంది చూచి. మా చెల్లెలుకూడా యిక్కడే వుందిట, మీరుకూడా వస్తే మరీ సంతోషిస్తారు మావాళ్ళు స్కూలు మేష్టర్లకి పదిహేను రోజులేనా శలవలు? వీలుంటే రండీ మళ్ళీ యెన్నాళ్ళకో వెళ్ళటం."

"ఆలోచిద్దాంలే" అంటూ లేచి వీధిలోనికెళ్ళి వస్తానని వెళ్ళేడు-గంగాభాయికి యేమీ తోచటం లేదు - ఆమెకి తత్‌క్షణమందే పుట్టినింటికి వెళ్ళవలెనని ఆశగలిగింది. తల్లి, సోదరీలు, చిన్ననాటి నెచ్చెలులూ, బొమ్మల కొలువు అన్నీ జ్ఞాపకం వచ్చాయి ఎప్పుడు అక్కడికి వెళ్ళి వాలుదామా అనిపించింది - డ్రాయరు తీసి, పెన్సలు పుచ్చుకుని కార్డు తీసి "తక్షణం రావలెను. పంపుతారట" అని వ్రాసింది తండ్రికి-సగం ఆందోళన మణగింది ఆమెకి

౨

గోపాలంగారికి చాలాకాలం వరకూ సంతానం లేకపోతే కాశీ మొదలైన యాత్రలు వెళ్ళి అనేక నదులలో స్నానాలు చెయ్యగా పుట్టింది గంగ - తర్వాత మరి యిద్దరు పిల్లలు పుట్టేరు-వారికి యమున, సరస్వతి అని పెట్టేరు పేర్లు-గంగ, యమున, సరస్వతి-అని ముగ్గురుకి పెట్టేరు-గోపాలంగారు మర్యాదగల కుటుంబీకుడు దసరాకి పెద్దల్లుని కూతురుని తీసుకువెడదామని వచ్చారు

"గంగా? మీ నాన్నగారొచ్చారు"

గంగాభాయి యీ మాటవింటూనే, మొఖం కడుక్కుంటూన్న మనిషి తుడుచుకోకుండానే చెంబుతో నీళ్ళుపట్టుకొచ్చింది "వచ్చేసా? కాళ్ళు కడుక్కోండి అమ్మా చెల్లెళ్ళూ క్షేమమేనా?" అంది

"ఆ, క్షేమమేనమ్మా నిన్ను బావనీ చూడాలని కావలసినంత కంగారు చేస్తున్నారు-చెల్లెళ్ళు"

గంగ త్వరగా కాఫీ తయారు చేసుకొచ్చింది-అంతా కలిసి పుచ్చుకున్నారు కుమార్తెగారింట్లో గోపాలంగారికి మర్యాద యెక్కువగా జరిగింది పులిహోర, ఆవడలు మొదలైన పిండివంటలు కూడా చేసింది గంగ,

అంతా సర్దాగాభోజనం చేశారు-మధ్యాహ్నంఅయింది-సుబ్బారావు గంగనుబిలచి "ఇదిగో మీనాన్నవచ్చారు నాకు తీరుబడిలేదుకదా వెళ్లటానికి-నీవుమాత్ర మెట్లా వెడతావు? యీసారి మేమిద్దరంకలిసివస్తామనిచెప్పు" అన్నాడు

"మళ్లీ యిల్లా అంటున్నారేమిటండీ పోనీవెళ్లొద్దాం రారాదండీ! నాల్గురోజులేవుండి వద్దాం"

"ఏమో నాకిష్టంలేదు నీయిష్టం తర్వాత"

"మీరు పంపుతానన్నారుగదా అని మానాన్నకి వుత్తరం వ్రాశాను తీరావచ్చినతర్వాత పంపనంటారేమిటండీ"

"వస్తేమాత్రమేమీ? చూచివెడతారు నిన్న యిక్కడచూచారుగదా! యింకెందుకు నీవు వెళ్లటం?"

"అయ్యో! అదేమండీ అల్లాఅంటారు? మాచెల్లెళ్లు, అమ్మ అంతా నన్నుచూడాలని అంటున్నారట పాపము"

"మీచెల్లెళ్లని అమ్మని యిక్కడికే తీసుకురమ్మని చెప్పు పండుగసర్దాగా ఇక్కడే చేసుకుందాం"

"పోనీ లెండి పంపుతారనియెంతో సర్దాపడ్డాను-పంపరూ? పదిరోజులుండి వస్తాను"

"నాకు యిష్టంలేదు-నీకిష్టమైతేవెళ్లు. మీనాన్నతోటి యిట్లాఅన్నట్లు చెప్పకుసుమీ, రమ్మంటే యిప్పుడు వచ్చేటందుకు వీల్లేదని చెప్పు"

"అయితే యెందుకువ్రాశావు అని అడుగతాడు, అప్పుడేమననూ? మీరే పంపనని చెప్పండి అదిగో మానాన్న వస్తున్నారు ఏమిచెపుతారో చెప్పండి-"

గోపాలంగారు "అమ్మాయీ!" అని పిల్చేరు

"లోపలికి రా నాన్నా!" అంటూ తండ్రికి ఎదురుగా వెళ్లిందిగంగ.

"రండి మామగారూ! కూర్చోండి" అని కుర్చీ చూపించాడు సుబ్బారావు

"ఏమోయి! పండక్కి నిన్ను అమ్మాయిని తీస్కు వెళ్లటానికివచ్చాను రేపే మంచిది ప్రయాణమయి సిద్ధంగావుండండి"

"నేనెందుకు? మీఅమ్మాయిని తీసుకువెళ్లండి"

"అమ్మాయిని తీసుకువెడతానోయీ నీవుకూడా రా. ఇప్పుడు శలవులేకేదూ, నీకూ? పిల్లలు, మీఅత్తగారూ చూడాలంటున్నారు-"

"అబ్బె వీల్లేదండి, ఈమాటువస్తాను. దాన్నితీసుకు వెళ్లండి"

"అల్లాఅంటే యేంచెప్పను? అమ్మాయీ! బట్టలు సర్దుకో రేపే ప్రయాణం"

పెనిమిటి వద్దని సైగచేయగా, గంగ మాట్లాడకుండా వెళ్ళిపోయింది

సుబ్బారావులేచి "మామగారూ! బజారుకు వెళ్ళి వస్తాను" అని వెళ్ళేడు

గోపాలంగారు యింట్లోకివెళ్ళి వుప్మాచేస్తూన్న గంగదగ్గరకూర్చుని "అమ్మా! తెల్లవారకుండా ప్రయాణమునకు మంచిది - వేగిరము బట్టలుసర్దుకో అల్లుడు రానన్నట్టేనా?" అన్నాడు

"నాన్నా! నన్నుపంపటం యిష్టంలేదు వారికి మొదటపంపుతానంటే వుత్తరంవ్రాశాను తీరావచ్చిన తర్వాత పంపనంటున్నారు"

"నాతో పంపుతానన్నాడే నీతో అట్లాయెందుకన్నాడు?"

"నీయెదుట వూరికే నీవేమనుకుంటావో అని అన్నారు. అసలు యిష్టంలేదు నీవు వెళ్ళవద్దని నాతో చెప్పి, తీసుకువెళ్ళండని నీతో చెప్పేరు నీవు బ్రతిమాలితే యేమంటారోమరి-"

"సరేలే నేను అడుగుతాను నీవు సిద్ధంగా వుండు"

గంగాభాయి సంతోషముతో వుప్మా, కాఫీ సిద్ధం చేసింది

3

సుబ్బారావు రాగానె అంతా ఫలహారంచేశారు తాంబూలంవేసుకుంటూ "యేమోయీ! అమ్మాయి రానంటోంది, యెందుచేతనోయి?"

"అదిరానంటే నేనేమిచెయ్యనండి నాఅభ్యంతరంలేదు"

"కాదోయి నీకుయిష్టముంటే అదితప్పకుండా వస్తుంది కాబట్టి నీవేచెప్పు"

"నేనేమిచెప్పను తప్పకుండా తీసుకువెళ్ళండి"

"అమ్మాయీ! విన్నావా? తీసుకువెళ్ళమన్నాడతను నీవురానంటావు"

"ఆయనకి యిష్టంలేనిదే యెట్లారానూ? పంపితే తప్పకుండా వస్తాను. వద్దుఅని చెప్పుటచేత రానన్నాను"

"విన్నావా? యెందుకుపంపవు? పదిరోజులువుంచుకుని తిరిగి పంపేస్తాను నామాటవిని పంపు మావాళ్ళంతా చూడాలని కంగారు పడుతున్నారు"

"ఇప్పుడు అనవసరంగా ఎందుకని అన్నాను ఈమాటు మేమిద్దరం వస్తాములెండి పదిరోజులు కాదు, నెలవుంటాము"

"అట్లాకాదు యిప్పుడు మీరిద్దరూ రండి పదిరోజులువుండి, యీసారి మళ్ళీవచ్చి నెలవుండవచ్చును నిన్నుకూడా తీసుకురమ్మని మీఅత్తగారూ మరీమరీ చెప్పింది నాకువీల్లేదంటే పనివుందేమో అనుకున్నాను గాని యిష్టంలేక అన్నావనుకోలేదు - ఇద్దరూకూడా రండి-"

"అల్లాగేలెండ రేపటిమాట ఆలోచిద్దాం"

౪

రాత్రి భోజనాలు అయినాయి సుబ్బారావు గదిలోనికి వెళ్ళేడు గంగ గృహలక్ష్మి చదువుతోంది. "అవునుగాని, మీనాన్నతో యెందుకు చెప్పావు?" అన్నాడు గదిలో అడుగుపెట్టుతూనే

"చెప్పకుండా వుండామనుకున్నాను గాని యెందుకురావని నొక్కి నొక్కి అడుగుతూంటే యేమనను? మీరు తీసుకువెళ్ళమనిఅంటే, నేను రానంటే నాది లోటు అవటంలేదూ?"

"నాన్సెన్సు, నాతోమాట్లాడకు. నీవెందుకూ పనికిరావు పట్టిఫూల్ వనుకోలేదు"

చేతిలోనిపుస్తకం పెట్టిమీద పెట్టి "యిదిగో, చూడండి! కోపంవచ్చిందా? తెలివితక్కువచేత చెప్పేను వెళ్ళనులెండి. మీరూ, నేనూ యీసారి వెడదాం మానాన్నతోటి అట్లాచెప్పేస్తాను"

"చాల్లే. చెప్పేస్తావు? ఇంతవరకు వచ్చినతర్వాత అల్లాచెపితే యేంబాగుంటుంది? వస్తానని చెప్పిరా"

"అల్లాగే పంపుతానన్నారని చెప్పివస్తా మీరు కూడారారూ, సర్దాగా వెడదాం?"

"నేను రాను నీవువెళ్ళు"

"అట్లాకాదు మీరువస్తేనేగాని నేనూవెళ్ళను. ఇద్దరంవస్తామని చెప్పివస్తాను"అని చక్కాపోయింది. తండ్రితో చెప్పి బట్టలుసర్దడం ఆరంభించింది ఇద్దరి బట్టలూసర్దింది

"నాబట్టలుకూడావేశావ్? ముఖ్యంగా నీతో రావాలన్నమాటా? నే లేకుండావెళ్ళవూ? అసాధ్యురాలవు నాచేత వప్పించావు ఎందుకూ నీకు వెళ్ళాలని అంతసరదా?"

"ఎవ్వరికైనా పుట్టింటికంటే వెళ్ళాలని ఆశ వుండదూ?"

పుష్పాంజలి

శ్రీమతి బి. పార్వతమ్మగారు

సూర్యభగవానునందు ప్రసూనతతుల
ముద్దుగుల్కు మొగాల సముద్రమందు
భవదనంతవిలాసముల్ ప్రతిఫలించు
శ్యామసుందర! సుకుమార! రామచంద్ర!
విమలగోదావరీసరిద్వీచికలను
భద్రకాననవేణునిస్వానములను
హాయిగ్రోలెద నీదుగీతామృతంబు
శ్యామసుందర! సుకుమార! రామచంద్ర!
పూతసాకేతపురిసరయూతటాన
నిలచి "హేరామ! సంసారజలధితరణ
మాంప్రసేదదయాలిధే మాంప్రసేద"
అనుచు చింతించువారె ధన్యాత్ములయ్య!
వలదు కరు లందలంబులు వలదు హారులు
స్వామి! చూపవె నీపాదజలజయుగళి
మ్రొక్కి ముద్దిడికొలుతు నే ప్రొద్దు తండ్రి!
శ్యామసుందర! సుకుమార! రామచంద్ర!
అలసి తీర్థాల వెంబడి నరుగబోను
సొలసి విపినాలు దపములు సలుపలేను
చేతు నొకనీదుపాదరాజీవసేవ
శ్యామసుందర! సుకుమార! రామచంద్ర!